# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 18-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. లోక్ సభ , శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్రం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు 2026 లోక్‌సభలో వీగిపోయింది.**

**2) స్వచ్ఛాంధ్ర సాకారం కావడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**3) రాష్ట్రంలో కల్తీ మద్యం నివారణకు మద్యాన్ని పరీక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 5 ప్రాంతీయ పరిశోధనాశాలలు ఏర్పాటు చేశామని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.**

**4) తెలంగాణలోని అన్ని ఆసుపత్రులను ఇండియన్ పబ్లిక్ హెల్త్ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.**

==========================

లోక్ సభ, శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు 2026 నిన్న లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో హాజరైన మొత్తం 528 మంది సభ్యులకు గాను, ఈ బిల్లుకు మూడింట రెండు వంతుల మెజారిటీ అయిన 326 ఓట్లు లభించలేదు. బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో, 298 మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. బిల్లు ఆమోదానికి అవసరమైన మెజారిటీ లేక బిల్లు వీగిపోయిందని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ బిల్లుతో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లులను కూడా ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

-------------------------

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం మహిళా సాధికారత వైపు భారత్ వేయాల్సిన చారిత్రాత్మక అడుగును అడ్డుకుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్ సభలో వీగిపోవటంతో ఆయన తన సామాజిక మాధ్యమం ఎక్స్ లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ట్వీట్ ను రీ ట్వీట్ చేసారు. ఇది కేవలం రాజకీయ పరమైన అడ్డంకి

మాత్రమే కాదని సమాన హక్కులు, సముచిత ప్రాతినిధ్యం కోరుతున్న కోట్లాది మహిళలకు చేసిన ద్రోహమని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు.

---------------------------

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్ విభజనపై జరిగిన ఓటింగ్‌లో కాంగ్రెస్ సభ్యులు వ్యతిరేకంగా వ్యవహరించడం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ అన్నారు. మహిళా సాధికారతకు దోహదపడే ఈ కీలక బిల్లును వ్యతిరేకించడం ద్వారా కాంగ్రెస్ తన అసలు వైఖరిని బయటపెట్టిందని ఆయన నిన్న విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు.

---------------------------

స్వచ్ఛాంధ్ర సాకారం కావడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. లక్ష్యాలు చేరుకోవడంలో విఫలమైతే... కారణాలు అన్వేషించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పురోగతిపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఈ ఏడాది మార్చి 31 వరకు రూపొందించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాంకులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కల్తీ మద్యం నివారణకు మద్యాన్ని పరీక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 5 ప్రాంతీయ పరిశోధనాశాలలు ఏర్పాటు చేశామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. నాణ్యమైన మద్యాన్ని ప్రజలకు అందించటానికి ప్రభుత్వం మద్యం పాలసీలో అనేక మార్పులు తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో పలు మద్యం దుకాణాల్లో మంత్రి నిన్న సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. అనంతరం ప్రాంతీయ ప్రోహిబిషన్ , ఎక్సైజ్ శాఖవారి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.......

వాయిస్...27 సెకన్లు

---------------------------

తెలంగాణలోని అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా ఆస్పత్రులను ఇండియన్ పబ్లిక్ హెల్త్ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్తు బలోపేతం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ నిన్న హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో మంత్రి అధ్యక్షతన సమావేశం అయ్యింది. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ... పేషెంట్లకు వారి నివాసాలకు సమీపంలోనే, వారి సొంత జిల్లాలోనే వైద్యం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని, ఇందుకు అనుగుణంగా సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేయాల్సి ఉందన్నారు. ఐపీహెచ్ఎస్‌కు అనుగుణంగా అన్ని ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, పరికరాలు, డయాగ్నస్టిక్స్, ఔషధాలు ఉండాలని, ఇందుకు ప్రణాళికలను రూపొందించాలని మంత్రి సూచించారు.

---------------------------

తెలంగాణాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ పునరుద్ధరణ పనులను పూర్తిగా శాస్త్రీయ విధానంలో, పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి చెప్పారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి నిన్న "నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ" ఛైర్మన్ అనిల్ జైన్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు.

---------------------------

విద్యుత్ రంగంలో మౌలిక వసతుల కల్పనకు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంలోని కాలనీలో 'ప్రధాన మంత్రి సూర్యఘర్ – ముఫ్త్ బిజిలీ యోజన' పథకాన్ని ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులుతో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వినియోగదారులకు విద్యుత్ భారం తగ్గి, నిరంతరాయంగా విద్యుత్ అందుతుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గంలో 'పీఎం సూర్యఘర్' పథకం ద్వారా 27 కోట్ల రూపాయల వ్యయంతో 2 వేల 400 ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచిత సోలార్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు.

---------------------------

హజ్ యాత్రికుల ప్రయాణం సురక్షితంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. కృష్ణా జిల్లా గన్నవరంలో హజ్ యాత్రికుల కోసం చేసిన తుది ఏర్పాట్లను మంత్రి , అధికారులతో కలిసి నిన్న పరిశీలించారు. యాత్రికుల సౌకర్యాలపై మైనార్టీ సంక్షేమ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..యాత్రికుల ప్రయాణం సాఫీగా, సురక్షితంగా సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుందని చెప్పారు. ఈరోజు ఉదయం 9 గంటలకు 160 మంది హజ్ యాత్రికులు తొలివిడతగా హజ్ యాత్రకు బయలు దేరి వెళ్లనున్నారు. రాష్ట్రం నుండి ఈ ఏడాది 2 వేల 5 మంది పవిత్ర మక్కా, మదీనా యాత్ర కు ప్రయాణం సాగించనున్నారని మంత్రి చెప్పారు. ఇందులో భాగంగా గన్నవరం విమానాశ్రయం నుంచి రెండు విడతలుగా 335 మంది వెళ్లనున్నారని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో ఈరోజు భిన్న వాతావరణం ఏర్పడే పరిస్థితి ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాలలో ఎండలు, మరికొన్ని చోట్ల వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాలతో పాటు పోలవరం పరిసర ప్రాంతాలు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

మరోవైపు 27 మండలాల్లో వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. తెలంగాణ వ్యాప్తంగా రాగల నాలుగు రోజుల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం లేదా గాలుల దిశలో మార్పుల ప్రభావంతో ఈ అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================